పొలంబడి.. సరికొత్త ఒరవడి

- సాగులో విజ్ఞానదాయక అంశాలపై అవగాహన
- రెండు నియోజకవర్గాల్లో 79 పొలంబడులు


పసలపూడిలో పొలంబడి ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాయవరం: సాగులో ఆధునీకతను అందిపుచ్చుకుంటేనే ప్రయోజనం.. సరైన మెలకువలు పాటిస్తేనే దిగుబడులకు ఆస్కారం ఉంటోంది.. అందుకే పంట కాలం ఏదైనా పుడమి పుత్రులకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం సహకారం అందిస్తోంది. సాగు ప్రారంభమైన నాటి నుంచి పంట చేతికి వచ్చే వరకూ సాంకేతిక పరిజ్ఞానం, వ్యవసాయ విజ్ఞానం పెంచేందుకు ప్రభుత్వం పొలంబడి కార్యక్రమాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది. వ్యవసాయ శాఖ ద్వారా క్షేత్ర స్థాయిలో రైతులకు నిర్వహిస్తున్న పొలంబడి ఎంతో మేలు చేకూర్చుతుంది. లక్ష్యాలకు అనుగుణంగా రైతు భరోసా కేంద్రాల వారీగా పొలం, రైతులను ఎంపిక చేశారు. ప్రస్తుత రబీ సీజన్‌లో పొలంబడుల నిర్వహణలో వ్యవసాయ శాఖ తన వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తుంది. సరాసరిని మించి అధికంగా దిగుబడులు సాధించేలా అన్నదాతలను చైతన్యం చేయడమే లక్ష్యంగా వ్యవసాయ శాఖ ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుత ఖరీఫ్‌లో మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 79 పొలంబడులు నిర్వహిస్తున్నారు.

సమన్వయంతో నిర్వహణ

ఒక్కో పొలంబడికి 25 ఎకరాలు, ఆసక్తి ఉన్న 30 మంది రైతులను ఎంపిక చేస్తారు. ఇందులో ఉత్సాహవంతుడైన ఒకరిని టీమ్ లీడర్‌గా ప్రకటిస్తారు. టీమ్ లీడర్ మిగిలిన రైతులను సమన్వయం చేస్తూ, పొలంబడి నిర్వహణకు క్షేత్ర స్థాయిలో తగిన ఏర్పాట్లు చేయాలి. ఇందుకు గాను టీమ్ లీడర్‌కు కొంత పారితోషికం ఇస్తారు. పొలంబడికి ఎంపికైన రైతులకు వివిధ రకాల మందులను అందజేస్తారు. ఎంపిక చేసిన పొలంలో మట్టి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపుతారు.

ప్రయోగాత్మకంగా సాగు

రైతన్నల భాగస్వామ్యంతో నిర్వహించే పొలంబడిలో 14 వారాల పాటు వివిధ అంశాలపై శిక్షణ ఇస్తారు. ఎంపిక చేసిన 25 ఎకరాల్లో రెండు ఎకరాల్లో ప్రయోగాత్మక సాగు చేస్తారు. 50 సెంట్లలో రైతు పద్ధతి, మరో 50 సెంట్లలో శాస్త్రీయ పద్ధతులు అనుసరించి సాగు చేయిస్తారు. మరో ఎకరంలో ప్రయోగాలు నిర్వహిస్తారు. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రకాలను సాగు చేస్తారు. వ్యవసాయ శాస్త్రవేత్తలను సైతం భాగస్వాములను చేసి లాభసాటి విధానాలను తెలియజేస్తారు. రైతులందరికీ ఆయా అంశాలపై ప్రయోగాలు చేసి అవగాహన కల్పిస్తారు. వీటితో పాటు బీమా పథకం, ఈ–పంట, ఇతర రాయితీలను వివరించి ఎక్కువ మంది లబ్ధి పొందేలా చర్యలు తీసుకుంటారు.

మండలం	నిర్వహిస్తున్న పొలంబడులు
రాయవరం	12
మండపేట	13
కపిలేశ్వరపురం	12
రామచంద్రపురం	12
కె.గంగవరం	15
కాజులూరు	15

అన్ని అంశాలను వివరిస్తూ..



పొలంబడి కార్యక్రమం ద్వారా సాగులో మెలకువలపై రైతులకు మంచి అవగాహన ఏర్పడుతుంది. దీనిని రైతులు సద్వినియోగం చేసుకుంటున్నారు. ఎరువులు, పురుగు మందులు, నీటి యాజమాన్యం, నారుమడుల పెంపకం నుంచి కోతల వరకూ అన్ని దశలకు సంబంధించిన అంశాలను వివరిస్తున్నాం. రైతులకు పొలంబడి విజ్ఞానదాయకంగా ఉంటుంది.

–కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

రేపు వైఎస్సార్ ఆసరా సొమ్ము జమ

కపిలేశ్వరపురం: మండలంలోని టేకి, కపిలేశ్వరపురం గ్రామాల్లో 26న వైఎస్సార్ ఆసరా సొమ్ము లబ్ధిదారుల ఖాతాల్లో జమ కార్యక్రమం జరుగుతుందని ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయా గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల మైదానాల్లో నిర్వహించే కార్యక్రమానికి ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు హాజరవుతారన్నారు. కపిలేశ్వరపురంలో ఉదయం 10 గంటలకు, టేకిలో మధ్యాహ్నం 2 గంటలకు ఈ కార్యక్రమాలు జరుగుతాయని అన్నారు. టేకిలో ఈ ఏర్పాట్లను ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి పర్యవేక్షించారు.

చర్యలు తీసుకోవాలని డిమాండ్

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలో గుర్తింపు లేని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌ను రద్దు చేసి అడ్మిషన్ల ప్రచారాన్ని ఆపాలని పీడీఎస్‌యూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు బి.సిద్ధూ విద్యాశాఖ అధికారులను శుక్రవారం డిమాండ్ చేశారు. ప్రభుత్వ గుర్తింపు పొందని ఆ పాఠశాల నెల రోజులుగా ద్రాక్షారామలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి అడ్మిషన్ల కోసం ద్రాక్షారామ, పరిసర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేస్తుందన్నారు. అయినా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోవడం సరైన విధానం కాదన్నారు.

క్లుప్తంగా

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత సీట్లు

కాజులూరు: ప్రైవేట్ స్కూళ్లలో పేద విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ఉచిత సీట్లను అర్హులు సద్వినియోగం చేసుకోవాలని మండల విద్యాశాఖాధికారి కేవీవీ సత్యనారాయణ అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలో అన్ని ప్రైవేటు స్కూళ్లలో 25 శాతం ఎల్‌కేజీ విద్యార్థులకు ఉచిత సీట్లు కేటాయించాలని ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు అందాయన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి గానూ ఆసక్తి కలిగిన విద్యార్థుల పేర్లను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. రిజర్వేషన్ల ప్రాతిపదికన స్కూళ్లలో సీట్లు కేటాయిస్తారన్నారు. మరిన్ని వివరాలకు తమ కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠ


స్వామివారిని దర్శించుకుంటున్న నరేన్ తదితరులు

కె.గంగవరం: పామర్రు ఎస్సీ కాలనీ వద్ద శుక్రవారం కోదండ రామాలయాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. అనంతరం విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాన్ని నిర్వహించారు. మూడు రోజులుగా ఆలయం వద్ద హోమాలు, ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. శుక్రవారం ఉదయం ఆలయంలో విగ్రహాన్ని ప్రతిష్ఠించి కల్యాణం జరిపారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన వేణు తనయుడు నరేన్, రాజ్యసభ సభ్యుడు పిల్లి బోస్ తనయుడు సూర్యప్రకాష్, ఎంపీపీ పంపన నాగమణి, ఏపీఐడీసీ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, సర్పంచ్ వాసంశెట్టి వెంకటదుర్గ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్ తదితరులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

రేషన్ బియ్యం స్వాధీనం


కోరుమిల్లి శ్రీవైష్ణవి ఫ్లోర్ మిల్లులో రికార్డులను పరిశీలిస్తున్న విజిలెన్స్ అధికారులు

కపిలేశ్వరపురం: కోరుమిల్లి శ్రీవైష్ణవి ఫ్లోర్‌మిల్లులో అక్రమంగా నిల్వ ఉంచిన 1,620 కిలోల రేషన్ బియ్యాన్ని రాజమహేంద్రవరం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్పీ పి.రవికుమార్ ఆదేశాల మేరకు సీఐ వై.సత్యకిశోర్ ఆధ్వర్యంలో అధికారుల బృందం శుక్రవారం ఫ్లోర్ మిల్లుపై ఆకస్మికంగా దాడి చేసింది. 31 సంచుల్లో 1,620 కిలోల బియ్యాన్ని స్వాధీనపర్చుకున్నారు. సీఐ వెంట విజిలెన్స్ తహసీల్దార్ విజయ్‌కుమార్, ఎంఎస్‌ఓ టి.సుబ్బరాజు, వీఆర్వో సత్య సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీ


వెల్ల సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ శాంతి

రామచంద్రపురం రూరల్: వెల్ల గ్రామంలో సచివాలయాలను రామచంద్రపురం డీఎల్‌డీఓ ఎ.శాంతి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సచివాలయ ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించి అందరూ హాజరైనట్లు గుర్తించారు. ఈ సందర్భంగా వారికి ఆమె పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ కార్యాలయ పని వేళల్లో విధిగా హాజరు కావాలని, ఒకవేళ పనిపై బయటకు వెళ్లాల్సి వస్తే మూమెంట్ రిజిస్టర్‌లో సమయం నమోదు చేయాలన్నారు. ప్రజలతో స్నేహంగా ఉంటూ వారికి అవసరమైన పనులను సకాలంలో పూర్తి చేసి సచివాలయాలకు మంచి పేరు తీసుకుని రావాలని సూచించారు. పంచాయతీ కార్యదర్శులు రాయుడు మోహన్, ఎండీ శ్వేత్లానా, సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం సర్వే రాళ్ల ఏర్పాటు

కపిలేశ్వరపురం: వ్యవసాయ క్షేత్రాల్లో సర్వే రాళ్లను నిర్దేశించిన ప్రమాణాల మేరకు ఏర్పాటు చేయాలని గ్రామ స్థాయి ఉద్యోగులకు తహసీల్దార్ కొమరం సూర్యారావు సూచించారు. కాలేరులో శుక్రవారం జగనన్న శాశ్వత భూహక్కు పథకంలో భాగంగా సర్వే రాళ్ల ఏర్పాటు ప్రక్రియను పరిశీలించారు. రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులతో గ్రామంలోని సర్వే తాలూకు వివరాలను అడిగి తెలుసుకుని పలు సూచనలు చేశారు. సమకూర్చిన సర్వే రాళ్లను పరిశీలించారు.

పరీక్షలకు 195 మంది హాజరు

రాయవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం జరిగిన ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 195 మంది విద్యార్థులు హాజరయ్యారు. గణితం–2బి పరీక్షకు 105, జువాలజీ పరీక్షకు 80, హిస్టరీ పరీక్షకు 10 మంది హాజరయ్యారని పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ దారపు వీరవెంకట నాగేశ్వరరెడ్డి తెలిపారు.

ఎన్ఎంఎంఎస్‌కు విద్యార్థుల ఎంపిక


రామచంద్రపురంలో ఎన్ఎంఎంఎస్‌కు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

రామచంద్రపురం: స్థానిక రత్నంపేట మున్సిపల్ హైస్కూల్ నుంచి 10 మంది విద్యార్థులు నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ (ఎన్ఎంఎంఎస్) స్కాలర్‌షిప్‌కు ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం విత్తనాల సుబ్బారావు శుక్రవారం విలేకరులకు తెలిపారు. విద్యార్థులు పి.దీపక్ సతీష్, పి.చిట్టి లక్ష్మీనారాయణి, సీహెచ్ తనీష్, పి.గణేష్, ఐ.ఆనంద్, పి. హరిప్రవీణ్, కె.దివ్య మధు భారతి, సీహెచ్ కీర్తి, వి.జ్యోత్స్న, టి.సాహితి ఎంపియ్యారు. వీరికి ఏడాదికి రూ. 12 వేల చొప్పున నాలుగేళ్ల పాటు రూ. 48 వేలు స్కాలర్‌షిప్పుగా అందిస్తారని తెలిపారు. ఒకే పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులను, విద్యార్థులను రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, డీవైఈఓ షాలేమ్ రాజు, మున్సిపల్ కమిషనర్ కె. శ్రీకాంత్‌రెడ్డి, ఎంఈఓ మానుపూడి శ్రీనివాస్ తదితరులు అభినందించారు.

ఎనిమిది మంది అర్హత

రాయవరం: ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ప్రాథమిక స్థాయిలో విద్యార్థులు అర్హత సాధించారు. రాయవరం మండలం నుంచి ఎనిమిది మంది విద్యార్థులు అర్హత పొందారు. మాచవరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి తమలంపూడి సంపత్‌రెడ్డి, ఒగ్గు కుశ్వంత్‌సాయి, అమలదాసు పావని, సోమేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి శాకా నాగరమ్య, వెదురుపాక జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బోనం వెంకటభాస్కర్ శ్రీరామ్, గొడుగు రమ్యశ్రీ, పసలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ద్వారంపూడి మధుసూదన శివశ్యామ్, కొవ్వూరి వెంకటలక్ష్మి అర్హత సాధించినట్లు ఆయా పాఠశాలల హెచ్ఎంలు పి.జగన్మోహిణి, రాయి దమయంతి, ఎం.అంబేద్కర్, వి.శాంతిసునీత తెలిపారు. వీరి వ్యక్తిగత అర్హతలను సంబంధిత హెచ్ఎంలు ధ్రువీకరించాల్సి ఉంది.

రంజాన్ మాస ప్రార్థనలు ప్రారంభం


మండపేటలో రంజాన్ ఉపవాస ప్రార్థనలో ముస్లింలు

రామచంద్రపురం రూరల్: మండలంలోని ముస్లింలు గురువారం నెలవంక కనిపించడంతో శుక్రవారం నుంచి పవిత్ర రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు ప్రారంభించారు. మసీదులలో తరావీహ నమాజ్‌లు చదివారు. ద్రాక్షారామలోని షియా జామియా జాఫరీ మసీదు (పెద్ద మసీదు)లో మత గురువు మౌలానా మీర్జా జాఫరీ హుస్సేన్ ఆధ్వర్యంలో, జామియా మసీదులో మత గురువు తసదుక్ హుస్సేన్ ఆధ్వర్యంలో, వెలంపాలెం షాబాజియా మసీదులో మత గురువు గులఫ్‌రజా ఆలం ఆధ్వర్యంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రంజాన్ మాసం సందర్భంగా మసీదులకు రంగులు వేసి అందంగా తీర్చిదిద్దారు.

మండపేట: ముస్లింలు అత్యంత పవిత్రంగా భావించే రంజాన్ మాసం ఉపవాస దీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. స్థానిక కలువపువ్వు సెంటర్‌లో జామియా మసీదు, గాంధీనగర్‌లోని అమినా మసీదు, సైదిల్‌పేటలోని హాజరత్‌హంజ మసీదుల్లో ముస్లింలు అధిక సంఖ్యలో ప్రార్థనలు చేశారు. రంజాన్ మాసంలో తొలిరోజు ఉపవాసం కావడంతో అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. సాయంత్రం ఉపవాసం విరమణ అనంతరం ఇఫ్తార్ నిర్వహించారు. కేశవరం, ద్వారపూడి గ్రామాల్లోని మసీదుల్లో ఉపవాస దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండపేట జామియా మసీదు ఇమామ్ ముహమ్మద్ గులాం ముర్శిద్ మాట్లాడుతూ నెల రోజుల పాటు ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు ఆచరిస్తారని తెలిపారు. దాన ధర్మాలు, ఆధ్యాత్మిక చింతన, సేవాగుణం రంజాన్ నేర్పే పాఠం అని ఆయన అన్నారు.


వెదురుపాక మసీదులో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాయవరం మండలంలో..

రాయవరం: పవిత్రమైన రంజాన్ నెల ఉపవాస దీక్షలు శుక్రవారం నుంచి మండలంలో ప్రారంభమయ్యాయి. వెదురుపాక, చెల్లూరు, లొల్ల, పసలపూడి, రాయవరం తదితర గ్రామాల్లో ఉన్న మసీదుల్లో ముస్లిం సోదరులు నమాజ్‌లు చేశారు. ముస్లింలు వేకువజాము నుంచి ఉపవాస దీక్షలతో నమాజులు చేశారు. ఈ మాసమంతా నియమ, నిష్ఠలతో కూడిన జీవన విధానాన్ని అనుసరిస్తామని, అలాగే పేద, ధనిక అంతరాలను తొలగించడానికి జకాత్‌ను విధిగా పాటిస్తామని ముస్లింలు తెలిపారు.

క్షయ నిర్మూలన అందరి బాధ్యత


వెల్లలో క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది


అర్తమూరులో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అన్నపూర్ణ, విజయభాస్కరరెడ్డి

మండపేట: అంతా బాధ్యత తీసుకుని క్షయ నిర్మూలనకు పాటుపడాలని అర్తమూరు సర్పంచ్ గొలుగూరి అన్నపూర్ణ, మండల మాజీ ఉపాధ్యక్షుడు విజయభాస్కరరెడ్డి దంపతులు అన్నారు. క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఆ పంచాయతీ కార్యాలయం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ అన్నపూర్ణ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న మందులను వైద్యుల సూచనలతో వాడటం ద్వారా క్షయను దూరం చేయవచ్చన్నారు. అనంతరం 150 మంది వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈఓ భీమేశ్వరీ, వైఎస్సార్ సీపీ నాయకులు గొలుగూరి సందీప్‌రెడ్డి, తేతలి భూపతిరెడ్డి, నల్లమిల్లి రామచంద్రారెడ్డి, తాడి రామారెడ్డి పాల్గొన్నారు. పాలతోడులో జరిగిన కార్యక్రమంలో క్షయ వ్యాధిగ్రస్తులకు సర్పంచ్ పిల్లా వెంకటలక్ష్మి, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అరవరాజు దంపతులు పండ్లు, పౌష్టికాహారం అందజేశారు.

కపిలేశ్వరపురం: అవగాహనతో క్షయ వ్యాధిని నివారించవచ్చని అంగర, వాకతిప్ప పీహెచ్‌సీల వైద్యాధికారులు పీఎస్ఎస్‌డీ రత్నకుమారి, పి.చంద్రమౌళి అన్నారు. అంగర, వాకతిప్ప, పడమర ఖండ్రిక, కేదారిలంక, కపిలేశ్వరపురం గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. వైద్యాధికారులు మాట్లాడుతూ వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించడం ద్వారా డాట్ చికిత్స విధానంతో నయం చేయవచ్చన్నారు. పీహెచ్‌సీల ఎంపీహెచ్ఎస్‌లు పి.సురేష్, సోమేశ్వరరావు, హెచ్ఈ బి.రామారావు పాల్గొన్నారు.

కాజులూరు: అప్రమత్తతతో వ్యాధులను దూరం చేయవచ్చని మండపేట టీబీ సూపర్‌వైజర్ కేఎస్‌వీ రమణ అన్నారు. క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని దుగ్గుదుర్రు, గొల్లపాలెం పీహెచ్‌సీ పరిధిలో వైద్య సిబ్బంది, ఆశ, వలంటీర్లు గ్రామ వీధుల్లో ర్యాలీలు నిర్వహించారు. క్షయ వ్యాధి సోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రజలకు వివరించారు.

రామచంద్రపురం రూరల్‌లో..

రామచంద్రపురం రూరల్: వెల్లలో పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి ఆదినారాయణ మాట్లాడుతూ దగ్గు, సాయంత్రం సమయంలో జ్వరం, రాత్రిపూట చెమటలు పట్టడం, ఆకలి మందగించడం, బరువు తగ్గడం, చాతి నొప్పి వంటి లక్షణాలు రెండు వారాలకు మించి ఉంటే పరీక్షలు చేయించుకోవాలన్నారు. సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, హెల్త్ సూపర్‌వైజర్లు వి.ఈశ్వరమ్మ, కె.శ్రీనివాస్, జి.కమలేశ్వరు పాల్గొన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

వెల్లసావరం గ్రామానికి చెందిన కేవీఆర్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో క్షయ వ్యాధిగ్రస్తులకు చేయూత అందించారు. వెల్ల పీహెచ్‌సీలో వారికి ఐదు కిలోల బియ్యం, ముప్పై కోడిగుడ్లు, ప్రొటీన్ పౌడర్, రాగి పిండి, కందిపప్పు, గోధుమ నూక, వేరుశనగ చిక్కీలతో కూడిన పోషకాహారం కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఆర్ఎంపీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కేవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారికి ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న మందులతో పాటు సరైన పోషకాహారం అందిస్తే త్వరగా కోలుకుంటారన్నారు. సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, డాక్టర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

కె.గంగవరం: పేకేరు, కుందూరు, పామర్రు, దంగేరు పీహెచ్‌సీల వైద్యాధికారులు రత్నసుధ, మాణిక్యం, పార్వతి ఆధ్వర్యాల్లో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీలు నిర్వహించారు. టీబీ సూపర్‌వైజర్ కేఎస్‌వీ రమణ, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మల్లికార్జునుడు పాల్గొన్నారు.

రాయవరం: స్థానిక పీహెచ్‌సీ వద్ద క్షయ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి దేవిరాజశ్రీ మాట్లాడుతూ క్షయను గుర్తించిన అనంతరం క్రమబద్ధంగా ఆరు నెలల పాటు వైద్యం తీసుకుంటే వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. ర్యాలీలో హెల్త్ ఎడ్యుకేటర్ డి.కృష్ణశేఖర్, సీహెచ్‌ఓ వాణికుమారి, హెల్త్ విజిటర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం..


మండపేటలో స్వీట్లు పంచుతున్న రవికుమార్ తదితరులు

మండపేట: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నుంచి మాదిగ సామాజిక వర్గానికి చెందిన బొమ్మి ఇజ్రాయేల్‌కు ఎమ్మెల్సీగా అవకాశం ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మాదిగలంతా రుణపడి ఉంటామని కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అన్నారు. ఎమ్మెల్సీగా ఇజ్రాయేల్ గెలుపును పురస్కరించుకుని రవికుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక 8వ వార్డులో వేడుకలు నిర్వహించారు. బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మాదిగలకు సీటు ఇస్తానని చెప్పి మాజీ సీఎం చంద్రబాబు మోసగించారని విమర్శించారు. సీఎం జగన్ ఇచ్చిన హామీని అమలు చేశారన్నారు. పార్టీ నాయకులు మందపల్లి రుద్రకాంత్, మందపల్లి సుధాకర్, యార్లగడ్డ సూరిబాబు, కొడమంచిలి వేణు, మందపల్లి సంజీవరావు తదితరులు పాల్గొన్నారు.

నూరు శాతం పన్నుల వసూలు


సంపరలో సచివాలయ కార్యదర్శులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ అమ్మాజీ

పెదపూడి: మండలంలోని 18 గ్రామాలకు గాను 16 చోట్ల నూరు శాతం పన్నులు వసూలు చేయడం అభినందనీయమని ఈఓపీఆర్డీ కె.హరికృష్ణ సత్యరెడ్డిని కాకినాడ డీఎల్‌పీఓ వై.అమ్మాజీ ప్రశంసించారు. సంపరలో పన్ను వసూళ్ల ప్రత్యేక డ్రైవ్‌ను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అమ్మాజీ మాట్లాడుతూ మండలంలో రూ.1.36 కోట్ల పన్నులు వసూలు చేయాల్సి ఉండగా రూ.1.17 కోట్లు వసూలు చేశారన్నారు. మొత్తం 85.64 శాతం పూర్తయిందన్నారు. 16 గ్రామ పంచాయతీల్లో నూరు శాతం పూర్తవ్వగా మిగిలిన జి.మామిడాడ, సంపర గ్రామాల్లో వేగవంతం చేశారన్నారు. అనంతరం గ్రామంలో పన్నులు వసూళ్లు పూర్తి చేసిన కార్యదర్శులతో ఆమె సమావేశం నిర్వహించారు. పారిశుద్ధ్యం మెరుగుపర్చాలని, కుక్కలను నియంత్రించాలని, పగటి సమయంలో వీధిదీపాలు వెలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యదర్శులు యాళ్ల ఉమామహేశ్వరరావు, జి.త్రినాథ్, బి.ప్రసన్నకుమార్, ఎస్‌వీ స్వామి, శిరీష, తరుణ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి ఉత్తమ సేవా పురస్కారాలు


ఉత్తమ సేవా పురస్కారాలు అందుకుంటున్న ఎంపీహెచ్ఈఓ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ పవన్‌కుమార్

గోకవరం: కొత్తపల్లి ప్రభుత్వాస్పత్రి వైద్య సిబ్బందికి జిల్లా ఉత్తమ సేవా పురస్కారాలు అందాయి. మండలంలో టీబీ వ్యాధిగ్రస్తులకు సేవలు అందించినందుకు ఎంపీహెచ్ఈఓ వైఎస్ రాయుడు, హెల్త్ అసిస్టెంట్ జి.పవన్‌కుమార్‌కు పురస్కారాలు దక్కాయి. శుక్రవారం రాజమహేంద్రవరంలో జరిగిన టీబీ నివారణా దినోత్సవం కార్యక్రమంలో డీఎంఅండ్‌హెచ్‌ఓ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌ఓ, జిల్లా టీబీ అధికారి డాక్టర్ వసుంధర చేతుల మీదుగా ఈ పురస్కారాలను అందుకున్నారు.

రేపు రక్తదాన శిబిరం

రాజానగరం: స్థానిక శ్రీలక్ష్మీ గణపతి గూడ్స్ ఆటో యూనియన్ ఆధ్వర్యంలో రాజానగరంలో ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించనున్నారు. రావులచెరువు గట్టున ఉన్న ఆటోస్టాండ్ వద్ద ఉదయం 9 నుంచి ఈ శిబిరం ప్రారంభమవుతుంది. తలసేమియా వ్యాధితో బాధపడే పిల్లలకు అవసరమైన రక్తం సకాలంలో అందక ప్రాణాలు కూడా పోతుంటాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని వారి కోసం ఈ శిబిరాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తున్నామని నిర్వాహకులలో ఒకరైన జనపరెడ్డి ప్రసాద్ తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 87904 29833ను సంప్రదించాలని కోరారు.

మీటర్ చిత్ర బృందం సందడి


ఐఎస్‌టీఎస్ కాలేజీలో హీరో కిరణ్ అబ్బవరం

రాజానగరం: తూర్పుగానుగూడెంలోని ఐఎస్‌టీఎస్ మహిళా ఇంజినీరింగ్ కాలేజీలో మీటర్ చిత్రబృందం శుక్రవారం సందడి చేసింది. కిరణ్ అబ్బవరం హీరోగా రమేష్ కాదూరి దర్శకత్వంలో ఈ సినిమా రూపొందించారు. ఈ సందర్భంగా హీరో కిరణ్ అబ్బవరం విద్యార్థినులతో మాట్లాడారు. ఆ చిత్రంలోని పాటలకు అనుగుణంగా డ్యాన్స్ చేసి ఉత్సాహం నింపారు. కుటుంబ సమేతంగా చూడదగిన చిత్రమని, వినోదానికి అధిక ప్రాధాన్యత ఉంటుందని, ప్రతిఒక్కరూ థియేటర్‌లో ఈ సినిమాను చూసి ఆదరించాలని కోరారు.

నేడు కమ్యూనిటీ హాలుకు శంకుస్థాపన

మండపేట: ద్వారపూడిలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆధ్వర్యంలో మత్స్యకార కమ్యూనిటీ హాలుకు శనివారం భూమిపూజ జరుగనుంది. ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి మంత్రి సీదిరి అప్పలరాజు, ఎంపీలు పిల్లి సుభాష్‌చంద్రబోస్, మోపిదేవి వెంకటరమణ, చింతా అనురాధ, పార్టీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు పొన్నాడ వెంకట సతీష్‌కుమార్ తదితరులు హాజరుకానున్నట్లు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు దంతులూరి శ్రీరామవర్మ తెలిపారు. ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని శుక్రవారం ఆయన కోరారు.

పూలే విగ్రహం ఏర్పాటుకు కృషి

రామచంద్రపురం: స్థానికంగా మహాత్మా జ్యోతీరావ్ పూలే విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తానని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాగాపు అమ్మిరాజు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మేధావులు, పూలే అభిమానులు కలసి రావాలని కోరారు.